TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:7 FRIDAY , MAY 15,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 7 శుక్రవారం 15 మే 2026 పేజీలు :8 వెల: 4/-

## కార్లు వదలి.. బస్సులు, మెట్రోల్లో ప్రయాణించండి

మే 14 (హంసకలం వార్త )

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, అంతర్జాతీయ చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు సూత్రాలు పాటించాలని ప్రభుత్వాలతోపాటు ప్రజలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఉద్యోగులపై కేంద్రం కొత్త ఆంక్షలు విధించింది. కార్లు వదలి.. బస్సులు, మెట్రోల్లో ప్రయాణించాలని ప్రజలకు స్పష్టం చేసింది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక రవాణా ప్రణాళికను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ప్రభుత్వ క్వార్టర్ల నుంచి కార్యాలయాలకు వెళ్లేందుకు - మిగతా2లో



## జిన్‌పింగ్ పై ట్రంప్ ప్రశంసలు

మే 14 (హంసకలం వార్త )

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య గురువారం బీజింగ్‌లో ఉన్నత స్థాయి సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల బృందాలను ఉద్దేశించి మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్ చైనా అధినేతపై ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్‌ను కలవడం తనకు గౌరవమని, ఆయన తనకు మంచి స్నేహితుడని కొనియాడారు. ఇరు దేశాలకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. ’మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. - మిగతా2లో



## చివరిగింజ వరకు కొంటాం



మే 14 (హంసకలం వార్త )

రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. - మిగతా2లో

# కేరళ సిఎం అభ్యర్థి సతీషన్‌కు రేవంత్ అభినందనలు

మే 14 (హంసకలం వార్త )

కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. - మిగతా2లో




## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

### స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాల పై స్పందించాలన్న కవిత

మే 14 (హంసకలం వార్త )

సంస్థను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశాడని ఆరోపణ మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. - మిగతా2లో



## మరోమారు తెర పైకి ఫార్ములా కేసు

మే 14 (హంసకలం వార్త )

తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా–ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు - మిగతా2లో



## పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు

### రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడ్డట్లు ఎస్పీ వివరణ



మే 14 (హంసకలం వార్త )

కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో కాల్పులు జరిపి.. నగలు దోపిడీకి పాల్పడింది సుభోద్ సింగ్ గ్యాంగ్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జరిగాసింగ్ అని చెప్పారు. గురువారం - మిగతా2లో

## ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా



మే 14 (హంసకలం వార్త )

కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత పాలన వల్ల రాష్ట్రంలోని రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో గతంలో లేని ఇబ్బందులు ఇప్పుడే ఎందుకని ప్రశ్నించారు. పెగడపల్లి మండలం కీచులాటపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో లేని ఇబ్బందులు రేవంత్ పాలనలో ఎందుకు - మిగతా2లో

## భద్రాద్రిని దర్శించుకున్న తుమ్మల

### ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ



మే 14 (హంసకలం వార్త )

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ప్రత్యేక స్వాగతం పలికారు. శ్రీ సీతారామచంద్ర స్వామికి మంత్రి ప్రత్యేక - మిగతా2లో

# జిన్‌పింగ్ పై ట్రంప్ ప్రశంసలు

-మొదటిపేజీ తరువాయి

పొరపొచ్చాలు వచ్చినప్పుడు కూడా మాట్లాడుకుని త్వరగా పరిష్కరించాము. మీరు ఒక గొప్ప నాయకుడు. ఇలా నేను మిమ్మల్ని ప్రశంసించడం కొందరికి నచ్చకపోవచ్చు. కానీ నేను ఉన్నది ఉన్నట్టు చెబుతున్నాను. చైనా, అమెరికాలు కలిసికట్టుగా అద్భుత భవిష్యత్తువైపు అడుగులు వేస్తున్నాయి ’ అని ట్రంప్ అన్నారు. ఈ పర్యటన కోసం తాను అమెరికాకు చెందిన అత్యుత్తమ వ్యాపారవేత్తలను తీసుకొచ్చానని కూడా ట్రంప్ చెప్పారు. వారందరికీ చైనా అధినేత అంటే గౌరవమని చెప్పారు. ఇదే అతిపెద్ద శిఖరాగ్ర సమావేశమని కూడా వ్యాఖ్యానించారు. ఇక ఈ సమావేశాల ప్రారంభంలో చైనా అధినేత జిన్‌పింగ్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సహకారం ఉండాలని అభిలషించారు. చైనా-యూఎస్ బంధం స్థిరంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం దృష్టి తమ రెండు దేశాలపైనే ఉందని అన్నారు. గత శతాబ్దంలో చూడని మార్పులు ప్రస్తుతం జరుగుతున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా అల్లకల్లోల పరిస్థితులు ఉన్నాయని, ప్రపంచం నాలుగు రోడ్ల కూడలిలో ఉందని అభిప్రాయపడ్డారు. చైనా, యూఎస్‌లు తమ దౌత్య బంధంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని కూడా వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎన్‌విడియా సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్ పాల్గొంటున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, టెక్నాలజీతో పాటు తైవాన్ అంశంపై కూడా చర్చించేందుకు ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాసింజర్ విమానాలను చైనాకు మరింతగా ఎగుమతి చేసేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు.

# పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు

-మొదటిపేజీ తరువాయి

కరీంనగర్‌లో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ గౌస్ ఆలం విలేకర్లతో మాట్లాడుతూ ఈ దోపిడీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం 161.4 తులాల బంగారు ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగతనం చేసిందని వివరించారు. మొత్తం వీటి విలువ రూ. 82 లక్షలు ఉంటుందన్నారు. బిహార్‌కు చెందిన సుభోద్ గ్యాంగ్‌కి.. గోల్డెన్ తీఫ్‌గా పేరుందని గుర్తు చేశారు. పీఎంజే జ్యువెలరీ షాపులో ముందుగా రెక్కీ నిర్వహించి.. అనంతరం ఈ దోపిడీని ఈ గ్యాంగ్ చేసిందన్నారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని మెహతాబ్ వద్ద ఈ ముఠా సెల్ ఫోన్, సిమ్స్ కొనుగోలు చేసినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్‌లలో బంగారు షాపులపై ఈ గ్యాంగ్ రెక్కీ నిర్వహించిందని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జాగీరా సింగ్ సహా ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను అరెస్ట్ చేశామని సీపీ తెలిపారు. వీరు నకిలీ ఆధార్, నకిలీ బైక్ నెంబర్లు, నకిలీ పేర్లతో తిరుగుతూ ఈ దోపిడీలకు పాల్పడతారని సీపీ గౌస్ ఆలం వివరించారు. రెండు నెలల ముందు ఈ గ్యాంగ్ తెలంగాణకు వచ్చిందని సీపీ గౌస్ ఆలం వివరించారు. ముగ్గురు నిందితులను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు చూపించారు. నిందితులను 12 రోజుల పాటు దోపిడీ దొంగల కేసులో పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. బంగారం దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన నిందితుడు అని పోలీసులు తెలిపారు. దోపిడీ తర్వాత రైలు, బస్సు ద్వారా తప్పించుకునేందుకు ప్రయత్నించారు. దోపిడీకి రెండు నెలల క్రితమే రెక్కీ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ గ్యాంగ్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ ఝార్ఖండ్ రాష్టాల్లో సుబోధ్ సింగ్ ముఠా చోరీలకు పాల్పడిందన్నారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులను సీపీ అభినందించారు. పిస్టల్స్‌తో వచ్చిన ఐదుగురు దొంగలు.. సిబ్బందిపై కాల్పులు జరిపి సుమారు కిలోన్నరకుపైగా బంగారం ఎత్తుకెళ్లారు. దొంగలు జరిపిన కాల్పుల్లో షాపు సేల్స్ మేనేజర్ ముస్తాక్ అలీతో పాటు సిబ్బంది కమల్, మధుకర్, సెక్యూరిటీ గార్డు రాజేశ్ తీవ్రంగా గాయపడ్డారు. షాపులోకి ఎంటరైన ఐదు నిమిషాల్లోనే పని ముగించుకున్న దొంగలు.. బయటికి పరుగెత్తి పల్సర్, అపాచీ బైక్‌లపై పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు పది నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన సిబ్బందిని ఆస్పత్రికి తరలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఎంపీ బండి సంజయ్ ఆఫీస్, జిల్లా జడ్జి ఇంటికి సమీపంలోనే సినీ ఫక్కీలో భారీ చోరీ జరగడంతో తీవ్ర కలకలం రేగింది.

# మరోమారు తెరపైకి ఫార్ములా కేసె

-మొదటిపేజీ తరువాయి

ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్‌ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్‌ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్‌ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్‌ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్‌ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్‌ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఏసీబీ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేయడంతో.. జూలై 31న కోర్టులో ఏం జరగబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

## డీజీపీ భార్య హత్య కేసులో పురోగతి.. దేశంలోనే కల్పన గ్యాంగ్

మే 14 (హంసకలం వార్త )

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన రిటైర్డ్ డీజీపీ వినయ్ రంజన్ రాయ్ భార్య హత్య, దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన, ఆమె ముఠా సభ్యులు దేశం విడిచి పారిపోలేదని, దేశ సరిహద్దుల్లోనే ఎక్కడో తలదాచుకున్నారని పోలీసులు దాదాపుగా నిర్ధారణకు వచ్చారు. నిందితులను పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక పోలీస్ బృందాలు దేశవ్యాప్తంగా గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ హత్య, దోపిడీ పక్కా ప్రణాళికతోనే జరిగిందని దర్యాప్తులో తేలింది. నిందితురాలు కల్పన ఫోన్ కాల్ డేటాను విశ్లేషించిన పోలీసులు, ఆమె ముఠా సభ్యులు నేపాల్‌కు వెళ్లలేదని స్పష్టం చేసుకున్నారు. దీంతో పూణె, ముంబై, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌తో పాటు ఇండో-నేపాల్ సరిహద్దుల్లోనూ నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ కేసులో కల్పనతో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే కల్పనకు సంబంధించిన కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు, వారి ద్వారా కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. నిందితులకు ఎవరు ఆశ్రయం కల్పించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు త్వరలోనే ఓ కొలిక్కి రానుందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా



ఉండగా, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో నేపాలీ ముఠా చేసిన భారీ దోపిడీ కేసులోనూ దర్యాప్తు వేగంగా సాగుతోంది. ఈ కేసులో ఏడుగురు నేపాలీలు ఉన్నట్లు గుర్తించిన మల్కాజ్‌గిరి పోలీసులు, హైదరాబాద్ సిటీ పోలీసులతో కలిసి ఢిల్లీ సరిహద్దుల్లో గాలిస్తున్నారు. ఈ ముఠా సభ్యులు సరిహద్దు దాటి నేపాల్‌కు చేరుకున్నారా లేక దేశంలోని ఇతర నగరాల్లో తలదాచుకున్నారా అనే దిశగా విచారణ జరుపుతున్నారు.

## ప్రతికూల వాతావరణం కారణంగా హైదరాబాద్ కు రావాల్సిన రెండు విమానాల దారి మళ్లింపు

మే 14 (హంసకలం వార్త )

హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారడం వల్ల శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నగర శివార్లలో ఆకాశం మేఘావృతమై, ల్యాండింగ్‌కు అవసరమైన స్పష్టత లేకపోవడంతో, భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు రెండు కీలక విమానాలను దారి మళ్లించారు. పూణె – హైదరాబాద్ (ఇండిగో) విమానాన్ని విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టుకు మళ్లించి అక్కడ సురక్షితంగా ల్యాండ్ చేయించారు. దుబాయ్ – హైదరాబాద్ (ఎమిరేట్స్) అంతర్జాతీయ విమానాన్ని బెంగళూరు విమానాశ్రయానికి డైవర్ట్ చేశారు. ఈ పరిణామాలతో ప్రయాణికులు చాలా ఇబ్బందికి గురయ్యారు. ఆ తర్వాత వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత, ఈ రెండు విమానాలు తిరిగి శంషాబాద్ చేరుకోవడంతో ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.




### కేరళ సిఎం అభ్యర్థి సతీషన్‌కు రేవంత్ అభినందనలు

-మొదటిపేజీ తరువాయి

పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## చివరిగింజ వరకు కొంటాం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీ చేశారు.

### కార్లు వదలి.. బస్సులు, మెట్రోల్లో ప్రయాణించండి

-మొదటిపేజీ తరువాయి

మెట్రో స్టేషన్ల మీదుగా ప్రత్యేక షటిల్ బస్సులు ప్రారంభించినట్లు తెలిపింది. మెట్రో, బస్సుల్లో ప్రయాణించే ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం అదనపు రవాణా భత్యాన్ని పెంచుతామని ప్రకటించింది. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల పని వేళల్లో మార్పుల కోసం కీలక ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించింది. నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ వాడే ఉద్యోగులకు ఆ కార్డులో ముందే నగదు చెల్లించాలని నిర్ణయించినట్లు కేంద్రం పేర్కొంది. మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్, రైడ్ సదుపాయాలతోపాటు ఎలక్ట్రిక్ రిక్షాల సంఖ్యను కూడా పెంచినట్లు వివరించింది. పర్యావరణ పరిరక్షణ కోసం కార్ పూలింగ్, మెట్రో ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలను కోరింది. ముడి చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో పొదుపు చర్యలు చేపట్టాలంటూ వివిధ మంత్రిత్వ శాఖలకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ విస్టా ఏరియాలో సొంత వాహనాల వాడకాన్ని తగ్గించాలని అధికారులను ఆదేశించింది. ఉదయం 8:30 నుంచి 9:30 మధ్య ప్రతి 10 నిమిషాలకు ఒక షటిల్ బస్సు అందుబాటులో ఉంటుందని వివరించింది. ఢిల్లీలోని సెంట్రల్ విస్టా పరిధిలో తిరగడానికి 12 ప్రత్యేక బస్సులతో 'ఇన్నర్ – ఔటర్ లూప్' వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు కేంద్రం వివరించింది.

## భద్రాద్రిని దర్శంచుకున్న తుమ్మల

-మొదటిపేజీ తరువాయి

పూజలు నిర్వహించారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా తొలిసారి ఎన్టీఆర్ క్యాబినెట్‌లో ప్రమాణ స్వీకారం చేసి నేటికి నలభై ఏళ్ళు పూర్తి అయ్యాయి. 1986 మే 14 తేదీన తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దర్శనానంతరం తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరాముడు అంటే భద్రాచలం అనేలా భక్త రామదాసు రామాలయం పునఃనిర్మాణం చేశారన్నారు. పూజ్యులు ఎన్టీఆర్ పాలనలో భద్రాచలం రామాలయం అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని తెలిపారు. రూ.351 కోట్లతో రామాలయం పునరాభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి రాముని ఆశీస్సులు ఎప్పుడూ ఉన్నాయన్నారు. భద్రాచలం ప్రాంతం నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా

-మొదటిపేజీ తరువాయి

వస్తున్నాయని ప్రశ్నించారు. కేసీఆర్ యకత్వంలో నీళ్లు, 24 గంటల కరెంట్, పంట పెట్టుబడి, ఎరువులు సకాలంలో అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక అంతా ఆగిపోయిందని విమర్శిం చారు. ప్రభుత్వం సక్రమంగా, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం పంట కళ్లాలోనే కుప్పల, తెప్పలుగా పోసి ఉంటున్నాయని, వర్షాల భయంతో రైతులు అరచేతుల్లో ప్రాణం పెట్టుకుని లారీల కోసం ఎదురుచూపు చూస్తున్నారని తెలిపారు. అంతేగాక బస్తాకు 3.2 కేజీ కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ మంత్రి, కలెక్టర్, కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల పట్టింపు లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాన్ని అవలంభిస్తున్నదని ఆరోపించారు. ఎన్నికల్లో రైతు డిక్లరేషన్ పేరుతో 36 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆయన గుర్తు చేశారు .


### మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

-మొదటిపేజీ తరువాయి

మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు. సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో చైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు. సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు. తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

# సంపాదకీయం


## ‘డీలిమిటేషన్’పై వక్రీకరణలు





‘డీలిమిటేషన్: దక్షిణాది రాష్ట్రాల సెల్ఫ్‌గోల్’ శీర్షికతో 28.4.2026 తేదీన ఆంధ్రజ్యోతిలో డా. జయప్రకాశ్ నారాయణ రాసిన వ్యాసంలో, “1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రతి రాష్ట్రానికీ కేటాయించిన సీట్లను 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించారు. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆ చర్య తీసుకున్నారు. 2001లో సీట్ల సంఖ్యలో ఆ స్తంభన వ్యవధి ముగిసింది. అయితే రాష్ట్రాలకు కేటాయించిన సీట్లలో యథాతథ స్థితిని మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని అప్పటి వాజపేయి ప్రభుత్వాన్ని ఒప్పించటంలో నేను కీలకపాత్ర పోషించాను” అని రాశారు. కానీ, ఇప్పుడు ఆయన వైఖరి మార్చుకోవడానికి ప్రస్తావించిన అంశాలు సమర్థనీయంగా లేవు. 1976 నుండి 2025 వరకు యాభై ఏళ్లలో వచ్చిన మార్పు ఏంటో కూడా గమనించాలి కదా! కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కుటుంబ నియంత్రణ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేసిన రాష్ట్రాల్లో జనాభా తగ్గింది, అమలు చేయని రాష్ట్రాల్లో జనాభా పెరిగింది. ఈ వాస్తవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన 2011 నాటి జనగణన గణాంకాలే వెల్లడించాయి. తాజాగా 2026 జనగణన గణాంకాలు అధికారికంగా వెల్లడైన మీదట రాష్ట్రాలవారీగా జనాభా పెరుగుదల లేదా తరుగుదలపై స్పష్టత వస్తుంది. జనాభా ప్రాతిపదికపై లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేయాలని భారత రాజ్యాంగంలో పొందుపరచబడింది. దాన్ని పరిగణనలో ఉంచుకునే 1976లో ఇందిరాగాంధీ (కాంగ్రెస్), 2001లో వాజ్‌పాయి (బీజేపీ) ప్రభుత్వాలు దేశ ప్రయోజనాలు, సమస్య సంక్లిష్టత దృష్ట్యా హేతుబద్ధమైన నిర్ణయం తీసుకుని యథాతథ స్థితిని కొనసాగించాయి. 1976--2001 మధ్య కాలం కంటే 2001--25 మధ్య కాలంలో రాష్ట్రాలవారీగా జనాభా పెరుగుదల -- తరుగుదల విషయంలో మరింత ఎక్కువ తారతమ్యాలు ఉండవచ్చు. ఇది విస్మరించలేని వాస్తవం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ సమతుల్యత, సామాజిక న్యాయం... ఈ దృక్కోణంతో రాజకీయాలకు అతీతంగా డీలిమిటేషన్ అంశంపై నిర్ణయం తీసుకోవాలి. ఈ పూర్వరంగంలో జయప్రకాష్ నారాయణ ఒక చిట్కా పరిష్కారాన్ని సూచించారు: “కొన్నేళ్లలో వలసలు అసమతుల్యతలను సరిచేస్తాయి. ఇప్పటికే కోట్లాది కార్మికులు దక్షిణాదిన, పశ్చిమ, ఉత్తరాదిన పలు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల్ని నిర్మిస్తున్నారు, సుస్థిరపరుస్తున్నారు. ప్రజలు ఇతర రాష్ట్రాలకు వెళ్లటాన్ని మనం సులభతరం చేయాలి. వారు ఎక్కడుంటే అదే వారి రాష్ట్రం కావాలి. అలా వారి జీవితాల్ని సౌకర్యవంతంగా, సురక్షితంగా మార్చాలి. ఆ మార్పు మన జనాభా సవాళ్లను పరిష్కరిస్తుంది.” ఇదీ వారు వ్యక్తం చేసిన అభిప్రాయం. అంటే, జనాభా పెరిగిన రాష్ట్రాల నుండి జనాభా తగ్గిన రాష్ట్రాలకు వలసలు పెరిగితే, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తే, కాలచక్రంలో సమస్య పరిష్కారం అవుతుందని వారి అభిప్రాయం. ఇది వినడానికి బానే ఉంది. మరి హైదరాబాద్ నుండి లండన్ -- వాషింగ్టన్ వరకు వలసదారులకు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనలను, తాజాగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వలసదారులను అవమానిస్తూ తన ‘ట్రూత్ సోషల్’లో షేర్ చేసిన పోస్ట్‌ను జయప్రకాష్ నారాయణ ఎలా చూస్తున్నారు? అమెరికాలో ఇటీవల 3,300 కేంద్రాలలో జరిగిన ‘నో కింగ్స్’ ర్యాలీల్లో పాల్గొన్న దాదాపు 80 లక్షల మందిలో అత్యధికులు వలసదారులే. నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య వలసదారుల సమస్య. ఆంధ్రప్రదేశ్‌లో మారుమూల గ్రామాల్లో కూడా బిహార్, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారే వ్యవసాయ కూలీలుగా మొదలుకొని హోటల్ పని దాకా పనిచేస్తున్నారు. దక్షిణాది నుంచి వలస వెళ్ళిన వారికి వ్యతిరేకంగా 1960--70లలో ముంబై కేంద్రంగా శివసేన చేసిన విద్వేషపూరితమైన ఆందోళనా చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవాలి. అలాంటి ఆందోళనలు చిన్నవో పెద్దవో దేశంలో పలు రాష్ట్రాలలో జరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు దారితీసిన కారణాల్లో ఇది కూడా ఒకటి. మోదీ ప్రభుత్వం “జనాభా పరంగా సీట్లు కోల్పోతున్న ఏడు రాష్ట్రాలకూ ఊహించని బహుమతిని ప్రతిపాదించింది” అని జయప్రకాష్ నారాయణ అంటున్నారు. లోక్‌సభలో మాట్లాడిన సందర్భంలో ప్రధానమంత్రి మోదీ, హోం మంత్రి అమిత్ షా చెప్పిన మాటలు జయప్రకాష్ నారాయణగారికి ఈ విశ్వాసం కలిగించి ఉండవచ్చు. కానీ అవి కేవలం నోటి మాటలే, బిల్లులో ప్రస్తావించలేదు. సమకాలీన చరిత్ర ఏం చెబుతోంది? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందడానికి నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ‘ప్రత్యేక తరగతి హోదా’ కల్పిస్తామని వాగ్దానం చేస్తూ రాతపూర్వక ప్రకటనను పెద్దల సభలో చదివి వినిపించారు. సభ ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యస్తీకరణ చట్టం--2014లోనే కడప ఉక్కు కర్మాగారం, ఓడ రేవు, వెనుకబడిన రాయలసీమ -- ఉత్తరాంధ్ర ప్రాంతాలకు అభివృద్ధి ప్యాకేజీ, రాజధాని నిర్మాణానికి -- మౌలిక సదుపాయాల కల్పనకు సంపూర్ణంగా ఆర్థిక తోడ్పాటు, పారిశ్రామికాభివృద్ధికి రాయితీలు... వగైరా వాగ్దానలు చేశారు. ఆచరణలో వీటన్నింటినీ ఎగ్గొట్టిన మోదీ ప్రభుత్వంపై జయప్రకాష్ నారాయణగారికి ఎంత విశ్వాసమో! ఇది చూస్తే “వాగ్దానం ఎందరో అవివేకులను తృప్తిపరుస్తుంది” అనే తెలుగు సామెత గుర్తుకు వచ్చింది. ఇప్పుడు దానికి ఒక సవరణ: “మేకవన్నె పులి తరహా రాజకీయ నేతల వాగ్దానాలు మేధావులను కూడా సంతృప్తిపరుస్తాయి”. మహిళా రిజర్వేషన్స్ అమలు అంశాన్ని ‘డిలిమిటేషన్’తో ఎందుకు ముడిపెట్టారన్నదే అసలు ప్రశ్న. దానికి జయప్రకాష్ నారాయణ వ్యాసంలో సముచితమైన ప్రస్తావనే లేదు. మరొక ముఖ్య విషయం చట్టసభల నాణ్యతా ప్రమాణాలు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 550 (రాజ్యాంగం గరిష్ఠంగా అనుమతించిన సంఖ్య) నుండి 850కి పెంచడం వల్ల “మంది ఎక్కువైతే మజ్జిగ పలచన” అన్న సామెత తీరుగా లోక్‌సభ పనితీరు మరింత దిగజారుతుందేమోనన్న భావన వ్యక్తమవుతున్నది. సమగ్ర ఎన్నికల సంస్కరణలు అత్యవసరం. దామాషా ఎన్నికల విధానంతో సహా పలు అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. 2023లోనే చట్టం చేసిన 33శాతం మహిళా రిజర్వేషన్స్ అమలును డిలిమిటేషన్‌తో పాటు లోక్‌సభ సభ్యుల సంఖ్య పెంపుదలతో ముడిపెట్టడంలోని మతలబు ఏంటి? దానిపై జయప్రకాశ్ నారాయణగారి డొంకతిరుగుడు సమర్థన ఆశ్చర్యాన్ని కలిగించింది.

# మారిన రాజకీయం ప్రమాదంలో ప్రజాస్వామ్యం





ఇరవయ్యవ శతాబ్దం మొదటి ఐదు దశాబ్దాలు రెండు ప్రపంచ యుద్ధాలు, వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమాలు చరిత్రను చాలా మలుపులు తిప్పాయి. మన దేశం కూడా ఆ చరిత్రలో భాగమే. గత ఎనిమిది దశాబ్దాలుగా భారత దేశంలో రాజ్యాంగం ఆధారిత ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉంది. స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో వచ్చిన కొన్ని నవలల్లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది అని భావోద్వేగంతో ఒక మధ్యతరగతి ఒక పేదవాడికి చెపితే, “అయితే ఏమవుతుంది?” అని అమాయకంగా అడగడం మనోహర్ మలగాంకర్ తన ‘బెండ్ ఇన్ గాంజెస్’ అనే నవలలో రాశాడు. మన ప్రాంతంలో చాలా చర్చకు వచ్చిన కన్యాశుల్కంలోని జట్కావాడు... “భారతదేశానికి స్వాతంత్ర్యం రాబోతున్నది” అని గిరీశం అంటే-- “మన ఊరిలోని హెడ్ కానిస్టేబుల్ మారతాడా?” అన్న ప్రశ్న చాలా దూరదృష్టితో రాసిందే. సంభాషణ చాలా సాధారణమైనదిగా కనిపించినా బలప్రయోగం లేని ఒక రాజ్యం వస్తుందా అన్న పేదవాడి ప్రశ్న అప్పటికంటే ఇప్పుడు ఎక్కువ రెలవెంట్ అనిపిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే రాజ్య బలప్రయోగం మీద నియంత్రణ. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చాలా ఆటుపోట్లకు గుర య్యింది. చాలా మూడవ ప్రపంచ దేశాలలో ఈ మాత్రం ప్రజాస్వామ్యం కొద్దికాలమైనా నిలు వలేక పోయింది. చాలా దేశాలు నియం తృత్వంలోకి, సైనిక పాలనలోకి వెళ్లిపోయాయి. మన దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగడానికి ఒక సమగ్రమైన రాజ్యాంగం తోడ్పడింది. బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొం దించడంలో కీలకమైన పాత్ర నిర్వహించాడనే కీర్తి ఆయనకు దక్కింది. రాజ్యాంగం మీద దాడి పెరిగిన కొద్దీ అంబేడ్కర్‌ను మననం చేసు కోవడం పెరుగుతున్నది. ఈ రాజ్యాంగంలోని ప్రాపంచిక దృక్పథం పెట్టుబడిదారీ ఆర్థిక నమూనాని ఒకవైపు అంగీకరిస్తూనే సోషలిస్టు సమాజ నిర్మాణం జరగాలని ఒక మధ్యేమార్గ ప్రయోగాన్ని వాగ్దానం చేసింది. ధనిక వర్గాలకి పెట్టుబడిదారీ పంథా, పేద వర్గాలకు సోషలిస్టు వ్యవస్థ అన్న ఒక మార్గం వేసే ప్రయత్నం చేసింది. దేశం ఎనిమిది దశాబ్దాలుగా ఒక చిక్కు మార్గంలోనే చిక్కుకుంది.ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా పేదల ప్రస్తావన లేకుండా, అసమానతల తగ్గింపు, అందరికీ అవకాశాలు, మనుషులంతా సమానమే అన్న భావన లేకుండా నిలువడం కష్టం. అందరూ సమానమే అన్న భావనను డా. అంబేడ్కర్ చాలా దూరదృష్టితో, ఎన్నికలలో రాజకీయంగా మనం సమానత్వాన్ని కల్పించాం. ఒక మనిషి, ఒక ఓటు, ఒకే విలువ. ఈ సమానత్వం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించకపోతే మనం ఎంతో కష్టపడి నిర్మించుకున్న ప్రజాస్వామ్య సౌధాన్ని ప్రజలు బద్దలుకొడతారు అని హెచ్చరిక చేశాడు. కానీ విచిత్రంగా సామాన్య ప్రజలు రాజ్యాం గాన్ని స్వంతం చేసు కుంటున్నారు, పాలకులు రాజ్యాంగం మీద దాడి చేస్తున్నారు. ఎన్నికల రాజకీయాలలో రాజ్యాంగం కల్పించిన సమానత్వం డా. అంబేడ్కర్ ఆశించిన సమానత్వ దిశలో కాక సమాజంలోని తీవ్ర అసమానతలు ఎన్నికలను నిర్దేశించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత ఎనిమిది దశాబ్దాలలో మొదటి రెండు దశాబ్దాలలో సోషలిస్టు నమూనా లాంటి వ్యవస్థ అన్న భావజాలం ప్రచారంలో ఉండేది. కానీ క్రమక్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతూ వచ్చింది. ఇందిరాగాంధీ నాయకత్వంలో ఈ వైరుధ్యం కొంత స్పష్టత పొంది సమాజంలోని అసంతృప్తి విభిన్న ఉద్యమాలకు దారితీసింది. ఈ అసంతృప్తిని గ్రహించిన ఇందిరాగాంధీ పేదరికాన్ని రాజకీయాలలో ఒక ప్రధాన అంశంగా ముందుకు తీసుకురావడంతో ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లను సమీకరించుకోగలిగారు. ఆమె భావజాలం వల్ల ధనిక వర్గాల సమీకరణ బలపడడం, పేద వర్గాల ఆకాంక్షలు పెరగడం వల్ల వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో సంక్షోభంలో చిక్కుకున్న ఇందిరాగాంధీ... రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను రద్దు చేసి, అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భారతదేశంలోని ‘రాజ్యాంగ ప్రజాస్వామ్యం’ (కాన్‌స్టి ట్యూషనల్ డెమోక్రసీ) ఎంత బలహీనంగా ఉందో ఒక్కసారి బయటపడింది. ఏ కారణం వల్ల ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు ప్రకటించిందో ఇప్పటికీ ఆ కారణాలు పూర్తిగా విశ్లేషించలేదు. ఆమె ఎన్నికలు ప్రకటించినప్పుడు జయప్రకాశ్ నారాయణ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, అరుణ్‌శౌరి కలిసి ప్రతిపక్షాలు ఏం చేయాలి అని చర్చించినప్పుడు అరుణ్‌శౌరి ఎన్నికలను బహిష్కరించాలి అని ప్రతిపాదిస్తూ... “నియంత ఎప్పుడూ తన విజయాన్ని గ్యారెంటీ చేసుకోకుండా ఎన్నికలకు వెళ్లరు” అని అంటే, “ప్రజలను మనం అంత తక్కువ అంచనా వేయకూడదు. సమాజం భయంలో ఉన్న మాట వాస్తవం. జనాన్ని మనం సమీకరించగలిగితే వ్యక్తులుగా భయపడుతున్న వాళ్లే సమిష్టిలో ధైర్యాన్ని కూడ గట్టుకుంటారు. భయానికి మందు సమిష్టిలోనే ఉంది” అని జయప్రకాశ్ నారాయణ్ చెప్పారని అరుణ్‌శౌరి వ్యక్తిగత చర్చలో నాతో అన్నాడు. అటల్‌బిహారి వాజ్‌పాయ్ కూడా జేపీ వాదనతో అంగీ కరించడంతో ఎన్నికలలో పాల్గొనాలనే నిర్ణయం తీసుకున్నామని అరుణ్‌శౌరి అన్నాడు. ఎన్నికల రాజకీయ చరిత్రలో మనదేశంలో 1977లో మొదటిసారిగా ప్రజలు భయం నుంచి బయటపడి అధికార పార్టీనే కాక, వ్యక్తి గతంగా ఇందిరాగాంధీని కూడా ఓడించారు. అప్పటి వరకు బలమైన నాయకుడు లేదా నాయకత్వం కేంద్రంగా నడిచే రాజకీయాల స్థానంలో సమిష్టి నాయకత్వం అధికారంలోకి వచ్చింది. భావ జాలపరంగా భిన్న భావజాలాలున్న కమ్యూనిస్టు పార్టీ, జార్జ్ ఫెర్నాండెజ్, జగ్జీవన్‌రాం, మొరార్జీ దేశాయ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, ఆడ్వాణీ... ఈ సమిష్టి నాయ కత్వంలో భాగం. ఇంత వైవిధ్యమైన, వైరుధ్యమైన సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేకపోయింది. ఎన్నికలలో ప్రజలు అంత పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినా, అంత ప్రజాబలం ఉన్నా జనతా పార్టీ కూలిపోవడం వెనుక ఓట్ల రాజకీయాల కంటే భిన్న ప్రయోజనాల మధ్య వైరుధ్యాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నదన్నది ఒక వాస్తవ అనుభవంలోకి వచ్చింది. ఇందిరాగాంధీ రెండవసారి గెలి చినప్పుడు ఆమె రాజకీయ పరిభాషలో చాలా మార్పు వచ్చింది. ప్రధానంగా ఆమె పేదల గురించి మాట్లాడడం చాలావరకు తగ్గించింది. భిన్న వర్గాల మధ్య వైరుధ్యాలు ఎక్కడికి దారితీస్తాయో అన్న అనుమానంతో ‘దేశ సమగ్రత, సమైక్యత’ అనే నినాదాన్ని ముందుకు తీసుకువచ్చింది. దీంతో బాటు తన సోషలిస్టు భావజాలం స్థానంలో పెట్టుబడిదారీ మార్గమే ఏకైక మార్గం అనే నిర్ణయానికి రావడం, ఆమె హతాన్మరణంతో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి కావడంతో రాజ్యాం గంలోని సోషలిస్టు భావజాలం గురించి మాట్లాడడం దాదాపు రద్దైపోయింది. పెట్టుబడిదారీ పంథా నియో లిబరలిజం అవతారం తీసుకోవడంతో దానికుండే కొన్ని కనీస ప్రమాణాలు-- ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వ హించడం, ధనప్రవాహం నిరోధించడం, రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడడం, విశ్వ విద్యాలయాలు సృజనాత్మక సంస్థలుగా పనిచేయడం-- లాంటివి కూడా పాటించలేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల రాజకీయాల స్వభావమే మారి పోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజా స్వామ్యం అనే భావనను విస్తృతంగా ఉపయోగించి పెరుగుతున్న సంపదకు ఒక గౌరవాన్ని కలిగించే ప్రయత్నం చేస్తుంది. కొంతవరకు ప్రజల మద్దతును కూడగడుతుంది. నియో లిబరలిజానికి ఆ అవసరం కూడా లేకుండా పోయింది. రాజ్య స్వభావమే చాలా మార్పునకు గురయింది. సంపద జగన్నాథ రథచక్రాల లాగా ముందుకు పోతున్నది. ఇందిరాగాంధీ 1970లలో అప్పటి వైరుధ్యాల వల్ల రాజ్యాంగాన్ని తాత్కాలికంగా పక్కకు పెడితే, అప్పటి ప్రతిపక్షాలు పోరాడాయి. కాని కలిసి పనిచేయలేకపోయాయి. కనీసం జనతాపార్టీ కొంతకాలం అయినా అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు అప్పటి సంక్షోభం కంటే తీవ్రమైనదైనా ప్రతిపక్షాలు కలిసే ప్రయత్నమే ముందుకు సాగడం లేదు. కలిసి ఎన్నికలలో పోటీచేయడం సాధ్యమే కావడం లేదు. వీటిని కలపడానికి ఒక జయప్రకాశ్ నారాయణ్ వంటి నాయ కుడెవ్వరూ లేరు. ఎన్నికలు సారంలోనే కాదు రూపంలో కూడా మారిపోయాయి. ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదు. అవి ప్రజాస్వామ్యంలో ఒక భాగం. నిజమైన ప్రజాస్వామ్యం ప్రజాచైతన్య స్థాయిని బట్టి, నిరంతర జాగరూకతను బట్టి, సమస్యలకు సమిష్టిగా స్పందించే ఒక సజీవ పౌరసమాజం మీద ఆధారపడి ఉంటాయి. రాజ్యాంగాన్ని, ఎన్నికల వ్యవస్థని, ప్రజాస్వామ్యాన్ని ఒక మానవీయ సమసమాజ స్వప్నాన్ని కాపాడుకోవడం ఇప్పుడు చాలా అవసరం.

# రాత్రివేళ దుకాణాల దందా

-అర్ధరాత్రి వరకు కిరాణా దుకాణాల హడావిడి..
-గంజాయి, మద్యం మత్తులో యువకుల న్యూసెన్స్..
-రాత్రివేళ బయటకు రావాలంటేనే భయం..
-చర్యలు తీసుకోవాలంటూ స్థానికుల ఆగ్రహం..

జగద్గిరిగుట్ట, మే 14 ( హంసకలం వార్త )

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ షిరిడీహిల్స్ రహదారి నెంబర్--1 ప్రాంతంలో అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న కిరాణా దుకాణాల వ్యవహారం స్థానికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నిత్యావసరాల కోసం రాత్రి 11 గంటల వరకు దుకాణాలు ఉండటం ఉపయోగకరమే అయినప్పటికీ, కొన్ని దుకాణాలు ప్రతిరోజూ రాత్రి ఒంటి గంట దాటే వరకు తెరిచి ఉంచడం వల్ల కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆరోపిస్తున్నారు. .నివాసాల మధ్యలో కొనసాగుతున్న ఈ దుకాణాల వద్ద అర్ధరాత్రి తర్వాత మద్యం, గంజాయి సేవించి వచ్చే వ్యక్తులు వాహనాలను రహదారిపైనే నిలిపివేయడం, గొడవలకు దిగడం వల్ల స్థానికులతో పాటు వాహనదారులు, పాదచారులు భయాం దోళనలకు



గురవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. రాత్రి పది గంటల తర్వాత బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు.చేసినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదని, కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు స్పందించలేదని కాలనీవాసులు చెబుతున్నారు. దుకాణ యజమానులకు పలుమార్లు చెప్పినా మా దుకాణం...మా ఇష్టం అంటూ ఎదురు సమాధానాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా పోలీసులు కఠిన చర్యలు తీసుకుని రాత్రి తొమ్మిది గంటల లోపే దుకాణాలు మూసివేసేలా చూడాలని, అర్ధరాత్రి వరకు వ్యాపారాలు కొనసాగిస్తూ న్యూసెన్స్ సృష్టిస్తున్న దుకాణదారులపై కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

# చందానగర్ అభివృద్ధిపై గాంధీ ఫోకస్

-కాలనీల సమస్యలపై కమిషనర్‌తో ముఖాముఖి సమీక్ష..

చందానగర్, మే 14 ( హంసకలం వార్త )

చందానగర్ వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులు, వర్షాకాలానికి ముందస్తు చర్యలపై ప్రజాపరిపాలన కమిటీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో కీలక సమీక్ష సమావేశం జరిగింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఒక రోజు, ఒక వార్డు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన గాంధీ, అభివృద్ధి పనుల్లో అలసత్వం అసలు సహించబోమని స్పష్టం చేశారు. పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పీజేఆర్ స్టేడియాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసి క్రీడాకారులకు





అత్యాధునిక వసతులు కల్పించాలని సూచించారు. స్టేడియం వద్ద వరదనీటి కాల్వ పునరుద్ధరణ, బ్యాడ్మింటన్ కోర్టు లీకేజీల నివారణ, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్ఎం రాయల్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో వరదనీరు నిల్వ కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. చందానగర్‌లో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వృద్ధులు, విద్యార్థులు, పాదచారులకు ఇవి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, రోడ్ల మరమ్మత్తులు, నాలాల విస్తరణ, పూడికతీత పనులకు తక్షణ నిధులు మంజూరు చేయాలని గాంధీ డిమాండ్ చేశారు. భవానీపురం నాలా విస్తరణ పనులను ప్రథమ ప్రాధాన్యంతో వెంటనే ప్రారంభించాలని కోరారు. వేమన కాలనీ, సురక్ష కాలనీ, శంకర్ నగర్ ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధి, సుందరీకరణ చేపట్టి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించాలని, తడి-- పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాలనీల్లో చెత్త, మట్టి కుప్పలను వెంటనే తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు..

# ఆల్విన్ కాలనీలో ప్రజలకు ఆరోగ్య వనం

హఫీజ్‌పేట్, మే 14 ( హంసకలం వార్త )

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో నూతనంగా నిర్మించిన వ్యాయామ వేదిక, నడక మార్గం, చిన్నారుల వినోద ఉద్యానవనాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు అరెకపూడి గాంధీ ప్రజాప్రతినిధులు, స్థానికులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు వి. జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరిత తెలంగాణ కార్యక్రమాలు ప్రజల జీవన విధానంలో కొత్త మార్పులకు నాంది పలుకుతున్నాయని తెలిపారు. ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్న ఉద్యానవనాలు పిల్లలు, యువత, వృద్ధులకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయని పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన హరిత వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులతో ఉద్యానవనాల అభివృద్ధి చేపడుతోందని వెల్లడించారు. నడక మార్గాలు, చిన్నారుల ఆట స్థలాలు, ప్రజల ఆరోగ్య సాధన కేంద్రాలు ఏర్పాటు చేస్తూ ప్రజల జీవన నాణ్యత పెంచే దిశగా చర్యలు కొన సాగుతున్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు



సాగుతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బల్లింగ్ యాదగిరి గౌడ్, కనకమామిడి నరేందర్ గౌడ్, బల్లింగ్ గౌతమ్ గౌడ్, శేఖర్ ముదిరాజ్, మన్నేపల్లి సాంబశివరావు, సుబ్బారావు, సంజు, పద్మారావు, విజయ్ భాస్కర్ రెడ్డి, ఆల్విన్ కాలనీ అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి, రాజధర్మ రెడ్డి, మల్లేష్, నర్సిములు, లక్ష్మారెడ్డి, పెద్ది రెడ్డి, సాంబశివ రెడ్డి, శ్రీనివాస్, వేణుగోపాల్, రవీంద్ర రెడ్డి, కిషన్‌రావు, సుదర్శన్ రాజు, గోపాల్, సదానంద్ రెడ్డి, వెంకటేశ్వరరావు, శివశంకర్ రెడ్డి, రమణ రెడ్డి, బాల్ రెడ్డి, వెంకట్ యాదవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు..

# భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవ వేడుకలు

ఆడబిడ్డల అండగా కేసీఆర్ పథకాలు..
-కాంగ్రెస్ బంగారం హామీ గల్లంతు..
- 107 మందికి చెక్కుల పంపిణీ..
- మళ్లీ కేసీఆర్ రాక ఖాయం..మాధవరం..

బాలానగర్, మే 14 ( హంసకలం వార్త )

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో వేలాది కుటుంబాలకు అండగా నిలిచాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బాలానగర్ ఎమ్మార్వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 107 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పేద కుటుంబాల ఇబ్బందులను దగ్గరగా చూసి ఆడబిడ్డల పెళ్లిళ్ల సమయంలో తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అమలైన ఈ పథకాలు లక్షలాది పేద కుటుంబాలకు ఊరటనిచ్చాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని ప్రజలకు హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం విషయంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు బీమా, మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలిపాయని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం పనిచేసిందని అన్నారు. ప్రజలు మరోసారి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు పట్టం కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మహేశ్వరి శ్రీహరి, ఆవుల రవీందర్‌రెడ్డి, పందాల సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# ఆడబిడ్డల అండగా కేసీఆర్ పథకాలు

-కాంగ్రెస్ బంగారం హామీ గల్లంతు..
- 107 మందికి చెక్కుల పంపిణీ..
- మళ్లీ కేసీఆర్ రాక ఖాయం..మాధవరం..



బాలానగర్, మే 14 ( హంసకలం వార్త )

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో వేలాది కుటుంబాలకు అండగా నిలిచాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బాలానగర్ ఎమ్మార్వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 107 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేద కుటుంబాల ఇబ్బందులను దగ్గరగా చూసి ఆడబిడ్డల పెళ్లిళ్ల సమయంలో తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అమలైన ఈ పథకాలు లక్షలాది పేద కుటుంబాలకు ఊరటనిచ్చాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని ప్రజలకు హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం విషయంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు బీమా, మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలిపాయని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం పనిచేసిందని అన్నారు. ప్రజలు మరోసారి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు పట్టం కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మహేశ్వరి శ్రీహరి, ఆవుల రవీందర్‌రెడ్డి, పందాల సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# రోడ్లపై చెత్తకు చెక్...చెత్త వేస్తే కఠిన చర్యలే



అల్విన్ కాలనీ, మే 14 ( హంసకలం వార్త )

శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో కాలనీల పరిశుభ్రతపై మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పల సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆ సమస్యను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ప్రజా ఖాతాల కమిటీ చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లగా, అధికారులతో మాట్లాడి గురు గోవింద్ సింగ్ నగర్ కాలనీలో చెత్త, మట్టి తొలగింపు పనులు ప్రారంభమయ్యాయని దొడ్ల వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త, మట్టిని దశల వారీగా పూర్తిగా తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త -- పొడి చెత్తను వేరువేరుగా చెత్త సేకరణ వాహనాల్లో మాత్రమే వేయాలని సూచించారు. నాలాలు, రహదారులు, చెరువుల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.నగర పాలక సంస్థ సిబ్బంది, కాలనీ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రతి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రవాసు, మల్లయ్య, ఎస్ఆర్‌పి నాగేశ్వర నాయక్, ఎస్ఎఫ్ఏ మల్లేష్, వెంకటరెడ్డి, సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు..

## వైఎస్సార్ సేవలే ప్రజల గుండెల్లో చిరస్మరణీయం



మే 14 ( హంసకలం వార్త )

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల జెశ్వంత్ రావు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా తొలి సారి బాధ్యతలు స్వీకరించిన చారిత్రాత్మక దినాన్ని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రజాహిత సంక్షేమ పథకాలతో కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల కోసమే జీవించి, ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన అరుదైన నాయకుడిగా కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అదే సంక్షేమ స్ఫూర్తితో పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని అన్నారు. మహానేత ఆశయాల సాధనకే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు..

## ఉద్యోగాల కోసం యువత రగిలింది

-చిక్కడపల్లిలో నిరుద్యోగుల గర్జన.. ప్రభుత్వానికి అల్టిమేటం..
-లక్షల ఖాళీలపై వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలంటూ డిమాండ్..
-ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్నారంటూ ప్రభుత్వంపై ఫైర్..
-మే 20 ఆవేదన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర యువతకు పిలుపు..
-న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరిక..



హైదరాబాద్, మే 14 ( హంసకలం వార్త )

రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యపై యువత ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యోగాల భర్తీలో తీవ్ర జాప్యం జరుగుతోందని మండిపడుతూ హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో భారీ సంఖ్యలో నిరుద్యోగ యువత ఆందోళనకు దిగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో ప్రాంతం హోరెత్తింది. మే 20న నిర్వహించనున్న నిరుద్యోగుల ఆవేదన సభ పోస్టర్‌ను ఆవిష్కరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నిరుద్యోగ యువత, ఎన్నికల సమయంలో లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పిందని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసి నియామక ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా చదువుకుంటూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను ప్రభుత్వం నిరాశపరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. యువత భవిష్యత్తుతో ప్రభుత్వం రాజకీయాలు ఆడొద్దని, వెంటనే నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మే 20న జరిగే ఆవేదన సభకు తెలంగాణ నలుమూలల నుంచి నిరుద్యోగులు, విద్యార్థులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నిరుద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు..

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసిల్దార్ బక్కయ్య



హైదరాబాద్, మే 14 ( హంసకలం వార్త )

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో గల వరి కొనుగోలు కేంద్రమైన గోదామును గురువారం తహసిల్దార్ బక్కయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములలోని నిల్వలు వాటి సామర్థ్యతను పరిశీలించి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలని,రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సకల సౌకర్యాలు కల్పించాలని ఆయన తెలిపారు. తహసీల్దార్ తో పాటు ఆర్ఐ గంగరాజా పాల్గొని రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు

# సంగారెడ్డిలో రూ.650 కోట్ల ఇండస్ట్రీ

-సంగారెడ్డిలో రూ.650 కోట్ల భారీ పరిశ్రమ..
-1500 మందికి ఉద్యోగాలు.. మహిళలకు పెద్దపీట..
-తొగర్‌పల్లిలో ఫుడ్ తయారీ కేంద్రానికి భూమిపూజ..
-పరిశ్రమల హబ్‌గా మారుతున్న సంగారెడ్డి..






సంగారెడ్డి, మే 14 ( హంసకలం వార్త )

సంగారెడ్డి నియోజకవర్గంలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కానుండటం స్థానిక యువతలో ఆశలు రేకెత్తిస్తోంది. కొండాపూర్ మండలం తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతంలో కేజేఎస్ యూనిట్--2 పేరుతో సమగ్ర ఆహార, పానీయాల తయారీ కేంద్రానికి భూమిపూజ నిర్వహించనున్నారు. సుమారు రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 1500 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొననున్నారు. ఇప్పటికే పాశమైలారంలో కొనసాగుతున్న యూనిట్‌లో వందలాది మహిళలు పనిచేస్తుండగా, ఇప్పుడు సంగారెడ్డిలో మరో భారీ యూనిట్ ఏర్పాటు కావడం స్థానికులకు శుభపరిణామంగా మారింది. సంగారెడ్డి ప్రాంత మహిళలకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి ప్రత్యేకంగా కోరినట్లు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. వారి కృషితోనే సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తుండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో ఈ ప్రాజెక్టుకు వేగం చేకూరిందని పేర్కొన్నారు. కాన్ఫెక్షనరీ, పానీయాలు, కాఫీ, పోషకాహార ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్ విభాగాలతో ఏర్పడనున్న ఈ యూనిట్ సంగారెడ్డిని ఆహార పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగుగా మారనుంది. స్థానిక యువతతో పాటు మహిళలకు ఉపాధి కల్పనలో ఈ పరిశ్రమ కీలక పాత్ర పోషించనుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి ప్రాంతంలో 1500 మహిళలకు ఉపాధి లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఒక మహిళగా ఇది తనకు గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి సహకారంతోనే ఈ ప్రాజెక్టు సాధ్యమైందన్నారు..

# కరీంనగర్‌లో హైటెక్ దోపిడీ గుట్టురట్టు

-పీఎంజే దోపిడీ ఛేదన.. ముగ్గురు అరెస్ట్..
-బీహార్ గ్యాంగ్ హంట్.. కోట్ల నగలు స్వాధీనం..

కరీంనగర్, మే 14 ( హంసకలం వార్త )

కరీంనగర్‌లో ఇటీవల సంచలనం రేపిన పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, పిస్టల్స్, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దోపిడీ వెనుక బీహార్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఉన్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, పీఎంజే జ్యువెలరీలో చోరీకి పాల్పడిన నిందితులు ఘటన అనంతరం బెంగాల్‌కు పరారయ్యారు. ప్రత్యేక బృందాలు బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ముమ్మర గాలింపు చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. ఈ దోపిడీకి మాస్టర్ మైండ్‌గా బీహార్‌కు చెందిన గోల్డెన్ థీఫ్ సుబోద్ సింగ్‌ను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ చోరీలో ప్రత్యక్షంగా ఐదుగురు దొంగలు పాల్గొనగా, పరోక్షంగా మొత్తం 13 మంది నిందితుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



ఇప్పటివరకు ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు, ప్రధాన నిందితుడు సుబోద్ సింగ్‌తో పాటు మరో 10 మంది కోసం ప్రత్యేక బృందాలతో వేట కొనసాగిస్తున్నారు. నిందితులు దోపిడీ కోసం ముందుగానే పక్కా ప్లాన్ వేసుకున్నట్లు విచారణలో తేలింది. దోపిడీ అనంతరం పోలీసులను తప్పుదారి పట్టించేందుకు పలుమార్లు వాహనాలు మార్చి రాష్ట్రాలు దాటినట్లు సమాచారం. సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు కేసును ఛేదించినట్లు తెలిసింది. అరెస్టైన నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల విలువ కోట్లలో ఉంటుందని సమాచారం. ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది..

# ప్రతి ఆదివారం పెట్రోల్ బంకులు బంద్

-ఆదివారం బంక్ బంద్..? ప్రజల్లో టెన్షన్
-సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలో నిజమెంత.!..
- వైరల్ వార్తతో వాహనదారుల్లో కలవరం..
-పెట్రోల్ కోసం ముందస్తు పరుగులు..
- కేంద్రం క్లారిటీ లేక గందరగోళం..

మే 14 ( హంసకలం వార్త )

దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం పెట్రోల్ బంకులు మూసివేయనున్నారనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మే 14 నుంచి ఎనిమిది రాష్ట్రాల్లో ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని, ఇంధన పొదుపు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోందని ప్రచారం జరుగుతోంది. దీంతో వాహనదారుల్లో గందరగోళం నెలకొంది. నిజంగానే ఇకపై ప్రతి ఆదివారం పెట్రోల్ బంకులు బంద్ అవుతాయా.? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. వైరల్ అవుతున్న పోస్టుల ప్రకారం ప్రధాని నరేంద్ర మోడీ తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించి దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని, ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజలు కూడా సహకరించాలని సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. వారం లో ఒకరోజు వాహనాలు తగ్గిద్దాం.. ఇంధనాన్ని ఆదా చేద్దాం అనే నినాదాలతో సోషల్ మీడియాలో సందేశాలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం, పెట్రోలియం మంత్రిత్వ శాఖ లేదా దేశంలోని ప్రధాన చమురు సంస్థలు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థల నుంచి కూడా ఆదివారాల్లో బంకులు మూసివేతపై స్పష్టత రాలేదు. దీంతో ప్రస్తుతం వైరల్ అవుతున్న సమాచారం పూర్తిగా అధికారికంగా నిర్ధారించబడలేదని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్తను నమ్మే ముందు ప్రజలు అధికారిక వర్గాల ప్రకటనలను పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో




కూడా ఇలాంటి పలు తప్పుడు ప్రచారాలు వైరల్ అయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం పెట్రోల్ బంకుల కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలుస్తోంది.. వైరల్ పోస్టులతో వాహనదారుల్లో టెన్షన్.! ఆదివారం బంకులు బంద్ వార్తపై క్లారిటీ లేదు.. కేంద్రం నుంచి అధికారిక ప్రకటన మాత్రం శూన్యం సోషల్ మీడియా ప్రచారంపై ప్రజల్లో గందరగోళం..

# వీహెచ్‌కు గౌరవ స్థానం కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం

మే 14 (హంసకలం వార్త )


తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా నూతన బాధ్యతలు స్వీకరించిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీ. హనుమంతరావును ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన వీ. హనుమంతరావుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా బాధ్యతలు అప్పగించడం ఎంతో సముచిత నిర్ణయమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన, పరిపాలనపై అనుభవం, సామాజిక అంశాలపై స్పష్టమైన దృక్పథం కలిగిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో వీ. హనుమంతరావు సూచనలు ప్రభుత్వానికి మరింత ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన మార్గదర్శకత్వంలో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణం తర్వాత ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, బలహీన వర్గాల అభ్యున్నతికి వీ. హనుమంతరావు నిరంతరం కృషి చేశారని కొనియాడారు. రాజకీయ జీవితంలో ఆయనకు ఉన్న విశాల అనుభవం యువ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో




సాగింది. వీ. హనుమంతరావుకు కీలక బాధ్యతలు దక్కడంపై కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

# వడ్ల కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఘోర వైఫల్యం





-రైతులను రోడ్డున పడేసిందంటూ బిజెపి ఫైర్

మే 14 (హంసకలం వార్త )

రామాయంపేట మండలం కోమటిపల్లి వద్ల కొనుగోలు కేంద్రంలో రైతుల దుస్థితిని పరిశీలించిన బిజెపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 20,25 రోజుల్లోగా రైతులు ఎండలో రాత్రింబవలు ధాన్యం అమ్ముకునేందుకు ఎదురుచూస్తున్న కొనుగోలు ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.సంచి తరుగు పేరిట రైతులను దోచుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే కొనుగోలు ప్రారంభించక పోతే కొనుగోలు కేంద్రాలు కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రామాయంపేట మండలం కోమటిపల్లి గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.నాయకులు మాట్లాడుతూ... “20 నుంచి 25 రోజులుగా రైతులు ఎండలో, రాత్రింబవళ్లు వడ్ల కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నారు.కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం చాలా దురదృష్టకరం.కేంద్ర ప్రభుత్వం గన్నీ సంచులు,సుతిలి,కమిషన్ ఖర్చులు భరిస్తున్నప్పటికీ,రాష్ట్ర ప్రభుత్వం కనీస బాధ్యతగా రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించి రైస్ మిల్లులకు పంపించడంలో పూర్తిగా విఫలమైంది” అని విమర్శించారు.అలాగే కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సంచి,తరుగు పేరిట 5నుంచి 6కిలోల వరకు అదనంగా తీసుకుంటూ మోసం చేస్తున్నారని ఆరోపించారు.“రైతులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం అవినీతి,అబద్ధాల ప్రభుత్వంగా మారింది. తెలంగాణలో రైతులు ఎన్నడూ చూడని ఇబ్బందులను ఇప్పుడు ఎదుర్కొంటున్నారు” అని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు జిల్లా కలెక్టర్ వెంటనే ఫీల్డ్ స్థాయిలో పరిస్థితులను పరిశీలించి కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కరించకపోతే కొనుగోలు కేంద్రాలు మరియు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,కౌన్సిలర్ శంకర్ గౌడ్,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల శేఖర్,పట్టణ మాజీ అధ్యక్షుడు భానుచందర్, జిల్లా నాయకులు దోమకొండ రాములు,పట్టణ నాయకులు యాదగిరి యాదవ్,బాసం అనిల్, సంతోష్,వెలుముల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేట మండలంలోని లక్ష్మాపూర్, కాట్రియాల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్





-కొనుగోలు,రవాణా ఆలస్యం కావద్దు..

-మిల్ లో అన్ లోడింగ్ త్వరగా కావాలి..

-కొనుగోళ్లు పూర్తి అయ్యేవరకు అధికారులు క్షేత్ర స్థాయిలో ఉండాలి..

-అదనపు కలెక్టర్ నగేష్

మే 14 (హంసకలం వార్త )

జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, అధికారులు కేంద్రాలని సందర్శించి కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు.గురువారం రామాయంపేట మండలం లక్ష్మాపూర్,కాట్రియాల్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎంత ధాన్యాం వచ్చింది,ఎంత కొనుగోలు చేశారు, ఎంత మంది హమాలీలు ఉన్నారు,సరిపడా గన్ని బ్యాగ్ లు,టార్పాలీన్ లు ఉన్నాయా,లారీలు వచ్చాయా లేదా,లోడింగ్ కి ఎంత టైం తీసుకుంటున్నారు.ట్యాబ్ ఎంట్రీ ఎలా చేస్తున్నారు అని తదితర వివరాలను కలెక్టర్ కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తేమ శాతం రాగానే ఎలాంటి ఆలస్యం లేకుండా కొనుగోలు అవ్వాలని,సరిపడా హమాలీలను పెట్టుకొని కొనుగోలు అయిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు.మిల్ కి వెళ్లే ట్రక్ లో కేంద్రానికి సంబందించిన ఒకరిని పంపించి,అక్కడ ధాన్యాం త్వరగా అన్ లోడ్ అయ్యేలా చూసుకోవాలన్నారు. అనంతరం అక్కన్నపేట గోదామును అడిషనల్ కలెక్టర్ నగేష్ సందర్శించి, అన్‌లోడింగ్‌ను వేగవంతం చేయాలని,ఎంట్రీలను పూర్తి చేయాలని ఇన్‌చార్జ్‌కు సూచించారు.ప్రస్తుతం 40మంది హమాలీలు పనిచేస్తున్నారని వివరించారు. ఈ కార్య క్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథును అరెస్టు చేయాలి

-విచారణ పేరుతో జాప్యం చేస్తున్న ప్రభుత్వం

-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు

మే 14 (హంసకలం వార్త )



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు బండి భగీరథను పోక్సో కేసులో ఆరోపణల నేపథ్యంలో విచారణ జరిపి అరెస్ట్ చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు.17 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచార ప్రయత్నం చేసిన ఆరోపణలపై ఫోక్సో కేసు ఎదుర్కొంటున్న భగీరథను తక్షణమే అరెస్టు చేసి,కఠినంగా శిక్షించాలని వ్యాఖ్యానించారు.శంషాబాద్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ..తండ్రి హోంమంత్రి కావడంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని భగీరథ చేసే నేరాలు అన్ని ఇన్ని కావు అని,గతంలో ఎన్నో దుర్ఘటనలో బండి భగీరథ నేరస్తుడని ఆనాటి నుండి భగీరథ ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేదని ఆయన తెలిపారు.17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించే అత్యాచార ప్రయత్నం చేయడం దుర్మార్గమని,ఇలాంటి నిందితులను సమాజం క్షమించకూడదని,కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.కొడుకు చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి తండ్రి బండి సంజయ్ తాను కేంద్ర మంత్రిని అని మరిచిపోయి వివిధ సభలలో ప్రశ్నించిన వాళ్లను బెదిరించే పద్ధతిలో మాట్లాడటం హేయమైన చర్య అని ఆయన అన్నారు.తండ్రిగా ఫెయిల్ అయిన బండి సంజయ్ కనీసం మంత్రిగా నైనా చట్టాలను ప్రజాస్వామ్యాన్ని గౌరవించి తన కొడుకు తప్పును అర్థం చేసుకొని పోలీసులకు పట్టించే బాధ్యత నుండి వైదొలిగి కొడుకును కాపాడడానికి తన మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడని ఆయన విమర్శించారు.ఈ కేసును కప్పిపుచ్చుకోవడానికి జైశ్రీరామ్ జై హనుమంతు అని నినాదాలు చేస్తూ యువతను ఈ కేసుపై ఆలోచన చేయకుండా చేయడానికి బండి సంజయ్ ప్రయత్నం చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.బిజెపికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బండి సంజయ్ ను మంత్రివర్గం నుండి తప్పించి పార్టీ పరువు కాపాడుకోవాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి,మండల కార్యదర్శి నర్రగిరి పాల్గొన్నారు.

## కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

-నారాయణపేట జిల్లా అధికారులకు ఎంపీ డీకే అరుణ దిశా నిర్దేశం..

మే 14 (హంసకలం వార్త )



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని,అర్హులందరికీ ఆయా పథకాలను లబ్ధి చేకూర్చాలని పాలమూరు దిశ కమిటీ చైర్ పర్సన్,డీ కే అరుణ అన్నారు.గురువారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి,సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ)మూడవ సమావేశం పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీ.కే.అరుణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతాసత్యయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులతో,కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల గురించి సమావేశంలో సమీక్షించారు. మొత్తం 45ప్రభుత్వ శాఖల పరిధిలో కేంద్ర,రాష్ట్ర నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంపీ డీకే అరుణ అధికారులతో సుధీర్ఘంగా చర్చించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా క్షేత్రస్థాయిలో సక్రమంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో లోటు పాట్లు ఉంటే సరి చేసుకుని పూర్తి స్థాయిలో అమలు జరిగి ప్రజలకు ఉపయోగపడేలా సమావేశంలో సమీక్షించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు

-క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా

అమలు చేయాలని,జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని అధికారులకు ఆమె సూచించారు.కేంద్రం ప్రభుత్వ నిధులు,రాష్ట్ర వాటా నిధులతో అమలు చేస్తున్న కేంద్ర పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యత వహించాలని అన్నారు.జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ కమిటీ సమావేశం మూడు నెలల కొకసారి నిర్వహించి కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులతో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు సమీక్షించి విజయవంతంగా అమలు చేసి ప్రజలకు లబ్ధి చేకూరేలా సమావేశంలో చర్చించి సంబంధిత శాఖల ద్వారా పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గత సమావేశంలో చర్చించిన అంశాలపై ఆయా శాఖలు తీసుకున్న చర్యా నివేదిక పై చర్చించారు.సమావేశంలో జిల్లా పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ,వ్యవసాయశాఖ,జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, విద్యుత్ శాఖ,గృహ నిర్మాణ,పంచాయతీ రాజ్,విద్యాశాఖ,డీడబ్ల్యుఓ, ఎస్సీ అభివృద్ధి,ఆర్ డబ్లుఎస్,పౌర సరఫరాల శాఖ, నాబార్డు,మైనింగ్ శాఖ,పశు సంవర్ధక,మత్స్యశాఖ, భూగర్భ జలవనరులశాఖ,జిల్లా మార్కెటింగ్,చీఫ్ ప్లానింగ్,ఉద్యానశాఖ,ఇరిగేషన్,కార్మికశాఖ,నేషనల్ హైవే,ఆర్ఆండబి,తంతి తపాల( పోస్టల్),జిల్లా పరిషత్, ఎల్ డిఎం,డీ ఎఫ్.ఓ,డీవై ఎస్.వో,ప్రజాఆరోగ్యశాఖ, మున్సిపాలిటీలు,మిషన్ భగీరథ,చేనేత జౌళిశాఖ ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.తొలుత జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి జిల్లాలో 272 గ్రామ పంచాయతీలకు గాను 201 గ్రామాల్లో సొంత పంచాయతీ కార్యాలయ భవనాలున్నాయని,మిగతా 71పంచాయతీలకు సొంత భవనాలు లేవని తెలిపారు.స్పందించిన ఎంపీ అరుణ ఇప్పటికీ సొంత పంచాయతీ కార్యాలయ భవనాలు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు.జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి జయచంద్రమోహన్ మాట్లాడుతూ...ఆయుష్ మాన్ భారత్ కింద జిల్లాలో ఇప్పటివరకు 2533 మంది వివిధ శాస్త్రచికిత్సలు చేసుకుని 5నుంచి 10లక్షల లోపు లబ్ధి పొందారని చెప్పారు.జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు ఉన్నారా లేదా అని ఎంపీ ఆరా తీశారు.వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ పీఎం కిసాన్ యోజన పథకం లబ్ధినీ,ఎరువుల సబ్సిడీ ద్వారా ఇప్పటివరకు కేంద్రం 207 కోట్లను చెల్లిందని చెప్పారు.రేషన్ బియ్యంలో కేంద్రం వాటా లేదా అని ప్రశ్నించారు.ఇకపై రేషన్ దుకాణాల్లో సీఎం ఫోటోతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోటో ఉండాల్సిందేనని ఎంపీ తేల్చి చెప్పారు.జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు నిరుద్యోగ యువత చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పించాలన్నారు.జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక మాట్లాడుతూ...దిశ సమావేశంలో శాఖల వారీగా చర్చించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని,ఆయా శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలు లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఆయా శాఖలు చేపట్టే పనులు ప్రారంభించినప్పుడు ప్రోటోకాల్ తప్పక పాటించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో దిశ కమిటీ సభ్యులు,అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎస్.ఈలు,డీ.ఈలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్ జన్మదిన వేడుకలు

మే 14 (హంసకలం వార్త )



రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు, దుర్గానగర్ ఎలోహిం గాస్పెల్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్ చేత కేక్ కట్ చేయించారు. శాలువా,పూలమాలలతో సన్మానించారు.రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్ ను దేవుడు ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో, ఐష్టశ్వర్యాలతో దీవించాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ఉపాధ్యక్షులు రెవరెండ్ పి. ప్రమోద్ కుమార్,సంయుక్త కార్యదర్శి రెవరెండ్ సోమారం రాజ్ కుమార్,కోశాదికారి రెవరెండ్ బట్టు శ్రీకాంత్,కమిటీ సభ్యులు రెవరెండ్ జాజుల యేసు రత్నం,రెవరెండ్ గంటి డానియల్,బ్రదర్ జాన్,బ్రదర్ డానియల్ భీమయ్య,బ్రదర్ ఎలియాజర్ అభిషేక్, జాయ్ బ్లేస్సిలు పాల్గొన్నారు

# బిజినెస్

## రిలయన్స్ గ్రూపులో ఆకాశ్ అంబానీకి కీలక పదవి



మే 14 (హంసకలం వార్త )

జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆకాశ్ అంబానీ నియమితులయ్యారు. రిలయన్స్‌కు చెందిన ఈ డిజిటల్ సేవల సంస్థ ఐపీవోకు వెళ్ళనుంది. ఈ నేపథ్యంలో ఆకాశ్ అంబానీని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏప్రిల్ 9వ తేదీ నుంచి ఈ నియామకం అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఐదేళ్ల కాలం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని మే 7వ తేదీన సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు సన్నద్ధమవుతున్న వేళఈ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది మే నెలాఖరున లేదా జూన్ నెలలో ఐపీవోకు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించే అవకాశం ఉంది. టెలికం విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డులో 2014 అక్టోబర్ నుంచి ఆకాశ్ అంబానీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022 జూన్ నెలలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలో జియో 2016లోనే కేవలం ఆరు నెలల వ్యవధిలో 10 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

### ప్రభుత్వ చర్యల అంచనాలతో పెరిగిన సెంటిమెంట్..

## వరుసగా రెండో రోజూ మార్కెట్ల జోరు

మే 14 (హంసకలం వార్త )



భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ లాభాలను నమోదు చేశాయి. గురువారం ట్రేడింగ్‌లో ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. కరెన్సీ అస్థిరతను నియంత్రించేందుకు ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 789.74 పాయింట్లు (1.06%) పెరిగి 75,398.72 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 277 పాయింట్లు (1.18%) లాభపడి 23,689.60 వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒక దశలో సెన్సెక్స్ 1,073 పాయింట్ల వరకు లాభపడగా, నిఫ్టీ 364 పాయింట్ల మేర పెరిగింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 2.74 శాతం, నిఫ్టీ హెల్త్‌కేర్ 2.56 శాతంతో టాప్ గెయినర్లుగా నిలిచాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా లాభపడ్డాయి. అయితే, టెక్నాలజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతం నష్టపోయింది. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి ప్రధాన ఐటీ కంపెనీల షేర్లు నష్టాలను చవి చూశాయి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బాండ్ల పై పన్నుల విధానాన్ని సులభతరం చేయడం వంటి చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్న వార్తలతో మార్కెట్లు పుంజుకున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అదే సమయం లో, ట్రంప్-షీ సమావేశం తర్వాత మెరుగైన అంతర్జాతీయ ఆర్థిక సహకారంపై ఆశలు కూడా సానుకూల ప్రభావం చూపాయి.

## టెన్షన్ మధ్యే భారత్‌కు వంటగ్యాస్..

### హర్మూజ్ జలసంధిని దాటిన రెండు ఎల్‌పీజీ నౌకలు

మే 14 (హంసకలం వార్త )



అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, పర్షియన్ గల్ఫ్ నుంచి భారత్‌కు వంటగ్యాస్ (ఎల్‌పీజీ) తీసుకువస్తున్న రెండు నౌకలు వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటాయి. ఈ పరిణామంతో ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఈ సముద్ర వాణిజ్య మార్గంలో ఇంధన రవాణా క్రమంగా పునరుద్ధరణ అవుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. వివరాల్లోకి వెళితే... 'సిమి' అనే ఎల్‌పీజీ నౌక గురువారం ఒమన్ గల్ఫ్‌లోకి ప్రవేశించింది. ఈ ప్రయాణ సమయంలో తన ట్రాన్స్‌పాండర్‌ను తాత్కాలికంగా స్విచ్ ఆఫ్ చేసినట్లు సమాచారం. ఈ నౌక ఖతార్‌లోని రాస్ లఫాన్ పోర్టు నుంచి గుజరాత్‌లోని కాండ్లాకు వస్తోంది. యూఏఈలోని రువాయిస్ రిఫైనరీ నుంచి వంటగ్యాస్‌తో బయలుదేరిన 'ఎన్వీ సన్‌షైన్' అనే మరో నౌక కూడా ఈ జలసంధిని దాటిన తర్వాత సిగ్నల్స్ నిలిపివేసింది. ఈ నౌక కర్ణాటకలోని మంగళూరు వైపు ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఇరాన్‌తో కాల్పుల విరమణ ప్రయత్నాలు 'లైఫ్ సపోర్ట్‌పై' ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. అమెరికా ప్రతిపాదించిన శాంతి ఒప్పందంపై ఇరాన్ స్పందన 'పూర్తిగా ఆమోదయోగ్యం కాదు' అని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్ తమ స్పందనను పంపింది. ప్రపంచ ముడిచమురు, ఎల్ఎన్‌జీ రవాణాలో అధిక భాగం హర్మూజ్ జలసంధి నుంచే జరుగుతుంది.

## ఆటలో బంగారు గొలుసు కిందపడేసుకున్న ఆర్సీబీ బ్యాటర్...

మే 14 (హంసకలం వార్త )




ఐపీఎల్ లో గత రాత్రి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. ఆర్సీబీ ఓపెనర్ జాకబ్ బెతెల్ ఔటయ్యే క్రమంలో తన బంగారు గొలుసును పిచ్‌పైనే జారవిడుచుకుని, అది గమనించకుండానే పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. రాయ్‌పూర్ లో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ బౌలర్ కార్తిక్ త్యాగి వేసిన బౌన్సర్‌ను బెతెల్ పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే బంతి హెల్మెట్‌కు తగిలి గాల్లోకి లేవగా, త్యాగి సులభంగా క్యాచ్ అందుకున్నాడు. ఈ క్రమంలోనే అతని మెడలోని గోల్డ్ చైన్ తెగి పిచ్‌పై పడిపోయింది. కానీ ఔటయ్యానన్న నిరాశలో ఉన్న బెతెల్ ఈ విషయాన్ని గమనించలేదు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన దేవదత్ పడిక్కల్ పిచ్‌పై మెరుస్తున్న చైన్‌ను చూశాడు. వెంటనే దానిని చేతిలోకి తీసుకుని అంపైర్‌కు అప్పగించి తన క్రీడాస్ఫూర్తిని చాటుకున్నాడు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, నెటిజన్లు సరదా కామెంట్లతో స్పందించారు. పడిక్కల్ స్పోర్ట్స్‌మన్‌షిప్‌ను పలువురు ప్రశంసించారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో కేకేఆర్‌పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ 192 పరుగులు చేయగా, ఆర్సీబీ 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లీ (105) అజేయ సెంచరీతో చెలరేగి జట్టును గెలిపించాడు. ఐపీఎల్‌లో కోహ్లీకి ఇది 9వ సెంచరీ. ఈ మ్యాచ్‌లో బెతెల్ 15 పరుగులు చేశాడు.

## ఆఫ్ఘన్ క్రికెటర్ జాద్రాన్ ప్రాణాంతక వ్యాధితో పోరాటం...


మే 14 (హంసకలం వార్త )



తీవ్ర అనారోగ్యంతో భారత్‌లో చికిత్స పొందుతున్న తమ దేశానికి చెందిన మాజీ క్రికెటర్ షాపూర్ జాద్రాన్‌ను ఆఫ్ఘనిస్థాన్ ప్రముఖ క్రికెటర్లు రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ నేడు పరామర్శించారు. హెమోఫాగోసైటిక్ లింఫోహిస్టి యోసిస్ (హెచ్ఎల్‌హెచ్) అనే వ్యాధితో బాధపడుతున్న జాద్రాన్, గ్రేటర్ నోయిడాలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జాద్రాన్‌ను పరామర్శించిన అనంతరం, రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగ పోస్టును పెట్టారు. ఆసుపత్రిలోని చిత్రాలను పంచుకున్నారు. గ్రేటర్ నోయిడాలో చికిత్స పొందుతున్న జాద్రాన్‌ను తాను, రషీద్ ఖాన్ కలిశామని మహమ్మద్ నబీ పోస్టులో పేర్కొన్నాడు. నా ప్రియమైన సోదరుడు అరుదైన వ్యాధితో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నాడ అని నబీ పేర్కొన్నాడు. మైదానంలో ఉంటే ఎలాంటి పోరాట పటిమను ప్రదర్శించేవాడో ఇప్పుడు జీవితంలో వ్యాధిపై అంతే ధైర్యంగా పోరాడుతున్నాడని తెలిపాడు. ఆసుపత్రి బెడ్ మీద అతనిని చూడటం బాధగా ఉందని భావోద్వేగానికి లోనయ్యాడు. అతడు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నానని పేర్కొన్నాడు. జాద్రాన్ 44 వన్డేలు, 36 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఈ 38 ఏళ్ళ పేసర్ రెండు ఫార్మాట్‌లలో 80 వికెట్లు పడగొట్టాడు. 2020లో ఆఫ్ఘన్ తరపున చివరి మ్యాచ్ ఆడాడు.

# స్పోర్ట్స్


## ముగ్గురు కెప్టెన్ల పై వేటుకు వేళాయే?







మే 14 (హంసకలం వార్త )



ఐపీఎల్ ప్రస్తుత సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ, మూడు ఫ్రాంచైజీలలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వరుస గా రెండు సీజన్లలో జట్లను ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో దారుణంగా విఫలమైన ముగ్గురు కెప్టెన్ల పదవులకు గండం ఏర్పడింది. ఈ నెలాఖరులో సీజన్ ముగిశాక అక్షర్ పటేల్, రిషభ్ పంత్, అజింక్యా రహానే తమ కెప్టెన్సీలను కోల్పోవడం ఖాయమని ఫ్రాంచైజీ వర్గాల సమాచారం. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఇప్పటికే అధికారికంగా ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో వరుసగా రెండుసార్లు విఫలమైన కెప్టెన్‌గా రిషభ్ పంత్ ముందున్నాడు. ఇక అజింక్యా రహానే నేతృత్వంలోని కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) కూడా దాదాపుగా రేసు నుంచి తప్పుకున్నట్లే. ఈ నేపథ్యంలో వీరి కెప్టెన్సీ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. మొత్తం మీద చూస్తే అక్షర్ పటేల్, రిషభ్ పంత్‌లకు ఆటగాళ్లుగా డిమాండ్ ఉన్నప్పటికీ, వచ్చే మినీ వేలంలో రహానేను కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంచైజీ ముందుకు రాకపోవచ్చని అంచనా.

## శర్వానంద్ సరసన ఛాన్స్ కొట్టేసిన మానస వారణాసి!



టాలీవుడ్ స్టార్ శర్వానంద్, వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను పెంచుకుంటున్నారు. తాజా గా ఆయన సీనియర్ దర్శకుడు శ్రీను వైట్లతో చేతులు కలపడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. శ్రీనువైట్ల అంటేనే మనకు గుర్తొచ్చేది కడుపుబ్బ నవ్వించే వినోదం. అయితే ఈసారి ఆయన కేవలం కామెడీకే పరిమితం కాకుండా, దానికి 'టైమ్ ట్రావెల్' అనే సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌ను జోడిస్తున్నారు. శర్వానంద్ టైమింగ్‌కు, శ్రీనువైట్ల మార్క్ హ్యూమర్‌కు తోడు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త మేజిక్ జరుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జులైలో సెట్స్ పైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఈ సినిమాను నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడినట్లు కనిపిస్తోంది. మొదట స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, చివరకు మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు సమాచారం. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న మానసకు, శర్వానంద్ పక్కన ఇది ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ కొత్త జోడీ వెండితెర పై ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

# దర్శకుడిగా మారుతున్న హీరో రామ్...

- రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్
- ఇక మెగాఫోన్ పట్టనున్న ఎనర్జిటిక్ స్టార్
- 23వ చిత్రంతో దర్శకుడిగా అదృష్టాన్ని పరీక్షించుకోనున్న వైనం



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా మారనున్నారు. 'దేవదాసు' చిత్రంతో హీరోగా రామ్ ప్రయాణం మొదలైంది. తనదైన నటన, చలాకీతనంతో, అదిరిపోయే డ్యాన్సులతో అభిమానులను సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్ ఇప్పుడు మెగా ఫోన్ పట్టుకోనున్నారు. రామ్ హీరోగా నటిస్తున్న తదుపరి చిత్రంలో అభిమానులకు అదిరిపోయే వార్త సిద్ధమైంది. హీరోగా తన 23వ చిత్రానికి రామ్ స్వయంగా దర్శకత్వం వహించనున్నాడు. ఈ చిత్రంతో ఆయన దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రేపు శుక్రవారం ఉదయం 10:08 గంటలకు అట్టహాసంగా వెలువడనుంది. తాను దర్శకుడిగా మారనున్నట్లు రామ్ అధికారికంగా ప్రకటించనున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో, ఆయనే దర్శకత్వం చేయాలను కుంటున్నారు. ఈ చిత్రానికి సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సామ్ సీఎస్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పూర్తయ్యాక, తర్వాత రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అభిమానులు రేపు రామ్ అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.


# 'మిస్టర్ ఎక్స్' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ




తమిళంలో రూపొందిన ఒక స్పై యాక్షన్ థ్రిల్లర్ 'మిస్టర్ ఎక్స్'. ఆర్య కథానాయకుడిగా నటించిన ఈ సినిమాలో శరత్ కుమార్ .. గౌతమ్ కార్తీక్ .. మంజూ వారియర్ .. అనఘ ప్రధానమైన పాత్రలను పోషించారు. ఏప్రిల్ 17వ తేదీన విడుదలైన ఈ సినిమా, నెల రోజులు తిరక్కముందే ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. భారీ బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమాకి, మను ఆనంద్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. చైనా రహస్యంగా అణుశక్తికి సంబంధించిన కార్యకలాపాలను నిర్వహిస్తూ ఉంటుంది. ఈ విషయంలో అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తుంది. చైనా అణు సంబంధమైన కదలికలను తెలుసుకోవడానికంటూ, భారత్ సాయంతో హిమాలయాలలోని 'నందాదేవి' పర్వతంపై ఒక డివైజ్ ను ఏర్పాటు చేస్తారు. 7 న్యూక్లియర్ క్యాప్సుల్స్ తో కూడిన డివైజ్ అది. దానిని డిజాస్టర్ గా కూడా వాడొచ్చనే విషయాన్ని భారత్ కి చెప్పకుండగా అమెరికా దాస్తుంది. అయితే 'నందాదేవి' అనే పర్వతంపై ఆ డివైజ్ ను సెట్ చేయడానికి వెళ్లిన వాళ్లంతా ప్రాణాలు కోల్పోతారు. 1965 నుంచి కూడా ఆ డివైజ్ కోసం గాలింపు జరుగుతూనే ఉంటుంది. అయితే అది రష్యాలోని మిలిటెన్ గ్రూప్ చేతికి చిక్కుతుంది. దాని విషయంలో వాళ్లు తీసుకున్న నిర్ణయం మరింత ప్రమాదకరమైనది కావడంతో, 'మిస్టర్ ఎక్స్' అడ్డుకోవడానికి ప్రయత్నిస్తాడు. అయితే చివరి నిమిషంలో వాళ్లకి పట్టుబడిపోయిన మిస్టర్ ఎక్స్, వాళ్ల స్థావరంలో బందీగా ఉండిపోతాడు. మిస్టర్ ఎక్స్ అసలు పేరు పరమేశ్వర సూర్యప్రతాప్ (శరత్ కుమార్). అతను 'రా'లో సీనియర్ ఆఫీసర్ గా పనిచేస్తూ ఉంటాడు. మాస్కోలోని షిప్ యార్డులో ఉన్న న్యూక్లియర్ డివైజ్ ను .. మిస్టర్ ఎక్స్ ను తీసుకురావలసిన బాధ్యతను 'రా' ఏజెంట్ గౌతమ్ (ఆర్య)కి అప్పగించబడుతుంది. అతను తన టీమ్ తో అక్కడికి బయల్దేరతాడు. అతని కదలికలపై కన్నేసిన అమరన్ చక్రవర్తి (గౌతమ్ కార్తీక్), ఆ డివైజ్ ను చేజిక్కించుకోవడానికి ప్లాన్ చేస్తాడు. గౌతమ్ నేపథ్యం ఏమిటి? అతని జీవితంలో 'కీర్తన' ( అనఘ)కి గల స్థానం ఎలాంటిది? పరమేశ్వర సూర్యప్రతాప్ తో గౌతమ్ కి గల సంబంధం ఏమిటి? అడుగడుగునా గౌతమ్ కి అమరన్ చక్రవర్తి అడ్డుపడటానికి గల కారణం ఏమిటి? అణు సంబంధమైన ఒక పెద్ద ప్రమాదం నుంచి ఈ దేశాన్ని కాపాడటం కోసం గౌతమ్ చేసే ప్రయత్నాలలో ఆయనకి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనేది మిగతా కథ. దేశ రక్షణకి సంబంధించిన ఒక ఆపరేషన్ చుట్టూ తిరిగే కథ ఇది. లవ్ .. ఎమోషన్ .. యాక్షన్ అనే మూడు ప్రధానమైన అంశాలను కలుపుకుంటూ దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్నాడు. ఢిల్లీలోని 'రా' ప్రధాన కార్యాలయం .. చెన్నై .. రష్యా నేపథ్యంలో ఈ కథ పరిగెడుతుంది. హీరో .. విలన్ .. 'రా' టీమ్ ఈ కథలోని ప్రధానమైన పాత్రలుగా కనిపిస్తాయి. ప్రతి పాత్రను రిజిస్టర్ చేయడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. హీరో చెల్లెలి సెంటిమెంట్ కి కట్టుబడి ఉంటాడు. అలాగే తన తండ్రిని విపరీతంగా ద్వేషిస్తూ ఉంటాడు. అందుకు సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ ను వెంటనే చెప్పకుండా ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తించాడు. ఇక ఒక సాధారణ కుటుంబానికి చెందిన కుర్రాడు, విలన్ గా మారడానికి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ కూడా కాస్త బలంగానే కనిపిస్తుంది. ఆ వైపు నుంచి కూడా ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు. ఏ తండ్రినైతే హీరో ద్వేషిస్తూ వచ్చాడో .. అదే తండ్రి కోరికను నెరవేర్చడం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టడమే ఈ కథలో మరింత బలమైన అంశంగా అనిపిస్తుంది. ఇక ఏ కథనైనా నెక్స్ట్ లెవెల్ కి చేర్చేవి ట్విస్టులే. అలాంటి ట్విస్టులు ఈ కథలోను అక్కడక్కడా కనిపిస్తాయి. కాకపోతే అవి ఆడియన్స్ కి అంత షాకింగ్ గా ఏమీ అనిపించవు. కాస్త సినిమా నాలెడ్జ్ ఉన్నవాళ్లు ఈజీగా గెస్ చేయవచ్చు కూడా. స్పై యాక్షన్ సినిమాలలో ప్రధానమైనవిగా కనిపించేవి యాక్షన్ ఎపిసోడ్స్. కాల్పులు .. ఛేజింగులు .. ఫైటింగులు ఒక రేంజ్ లో ఉండాలి. అప్పుడే జోనర్ కి తగిన అవుట్ పుట్ వచ్చిందని ఆడియన్స్ భావిస్తారు. అలా చూసుకుంటే ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ లు గట్టిగానే డిజైన్ చేశారు. అందుకు సంబంధించిన ఎపిసోడ్స్ పెర్ఫెక్ట్ గానే వచ్చాయని చెప్పాలి. కాకపోతే లవ్ .. ఫ్యామిలీ ఎమోషన్స్ పెద్దగా ప్రభావితం చేయలేకపోయాయి. స్పై యాక్షన్ సినిమాలు అనగానే, కథ అనేక దేశాలను చుట్టి రావలసి ఉంటుంది. అందుకు అయ్యే బడ్జెట్ కూడా భారీగానే ఉంటుంది. ఆ విధమైన భారీతనం ఈ సినిమాలో మనకి కనిపిస్తుంది. క్వాలిటీ విషయంలో రాజీ పడలేదనే చెప్పాలి. ఆర్టిస్టులంతా చాలా నేచురల్ గా చేశారు.

# 'పెద్ది' సినిమాతో కొత్త బిజినెస్ లోకి హోంబలే ఫిల్మ్స్!

- ఓవర్సీస్ పంపిణీ రంగంలోకి అడుగుపెట్టిన హోంబలే ఫిల్మ్స్
- తొలి ప్రాజెక్ట్‌గా రామ్ చరణ్ "పెద్ది"ని ఎంచుకున్న సంస్థ
- హోంబలే చేరికతో సినిమాపై భారీగా పెరిగిన అంచనాలు
- ప్రపంచవ్యాప్తంగా భారీ విడుదలకు మార్గం సుగమం
- జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న "పెద్ది"



'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' వంటి భారీ విజయాలతో దేశవ్యాప్తంగా పేరు పొందిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మరో కీలక ముందడుగు వేసింది. నిర్మాణ రంగంలో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ, ఇప్పుడు అంతర్జాతీయ పంపిణీ రంగంలోకి అడుగుపెడుతోంది. ఈ ప్రయాణంలో తమ తొలి చిత్రంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది'ని ఎంచుకుంది. భారతీయ కథలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు చేరవేయాలనే లక్ష్యంతో హోంబలే ఫిల్మ్స్ తన ఓవర్సీస్ పంపిణీ విభాగాన్ని ప్రారంభించింది. దీనికి నాందిగా 'పెద్ది' చిత్రాన్ని ఎంచుకోవడం విశేషం. ఈ నిర్ణయంతో రామ్ చరణ్ సినిమాకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ ప్రచారం లభించనుంది. హోంబలే వంటి పెద్ద సంస్థ నేరుగా పంపిణీ చేస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా కీలక దేశాల్లో భారీ స్థాయిలో విడుదల ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రామ్ చరణ్ ఇంటెన్స్ మేకోవర్, పవర్‌ఫుల్ విజువల్స్‌తో కూడిన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. దీనికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ కూడా తోడవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## 'జన నాయగన్' కోసం రంగంలోకి సీఎం విజయ్..

# కేన్స్ వెళ్లిన నిర్మాతకు పిలుపు!



తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర నటుడు విజయ్ తన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు మార్గం సుగమం చేసేందుకు స్వయంగా రంగం లోకి దిగినట్లు తెలుస్తోంది. సెన్సార్ సమస్యల కారణంగా విడుదల ఆగిపోయి ప్రస్తుతం రివైజింగ్ కమిటీ వద్ద ఉన్న ఈ సినిమా అడ్డంకులను తొలగించే పని పై ఆయన దృష్టి సారించారు ఇందులో భాగంగా, ఫ్రాన్స్‌లో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్ర నిర్మాతను తక్షణమే చెన్నైకి తిరిగి రావాలని విజయ్ సూచిం చినట్టుగా కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విజయ్ నటుడిగా చేస్తున్న చివరి చిత్రం కావడంతో 'జన నాయగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ఒకవైపు పాలనలో సంచలన నిర్ణయాలు తీసుకుంటూనే తన సినిమా విడుదలకు ఉన్న అడ్డంకులను తొలగించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కేవీఎన్ బ్యానర్ నిర్మాత వెంకట్ ను కేన్స్ పర్యటన మధ్యలోనే ముగించుకుని చెన్నై బయల్దేరి రావాలని విజయ్ కోరినట్లు సమాచారం. విజయ్ పిలుపుతో నిర్మాత చెన్నైకి పయనమైనట్లు తెలియడంతో, త్వరలోనే 'జన నాయగన్' విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పరిణామంతో విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449